


# విభారె
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 21-03-2024 సంపుటి : 06 సంచిక : 191 పేజీలు : 8 వెల : రూ 3-00

# తొలివిడత ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

**ఏప్రిల్ 19న జరిగే ఎన్నికలకు నామినేషన్లు షురూ**

**17 రాష్ట్రాలు, నాలుగు కేంద్రపాలిత ప్రాంతాలు**

**మొత్తం 102 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు**




న్యూఢిల్లీ,మార్చి20 : ఏప్రిల్ 19న పోలింగ్ జరగనున్న లోక్‌సభ తొలి విడత ఎన్నికల కోసం నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. నోటిఫికేషన్ జారీతో బుధవారం నుంచే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం అయ్యింది. బీహార్ మినహా తొలి విడత లోక్‌సభ ఎన్నికలు జరిగే మిగితా 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో నామినేషన్ దాఖలుకు ఈ నెల 27 వరకు అవకాశం ఇచ్చారు. బీహార్‌లో మాత్రం మార్చి 28 వరకు నామినేషన్ల దాఖలుకు అవకాశం కల్పించారు. బీహార్ మినహా మిగితా 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో మార్చి 28న నామినేషన్ల స్క్రూటినీ నిర్వహించనున్నారు. బీహార్‌లో మార్చి 30న నామినేషన్ల స్క్రూటినీ జరగనుంది. బీహార్ మినహా మిగితా 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో మార్చి 30 నామినేషన్ల ఉపసంహరణకు తుదిగడువు. బీహార్‌లో నామినేషన్ల ఉపసంహరణకు ఏప్రిల్ 2 వరకు అవకాశం ఇచ్చారు. జూన్ 6తో సాధారణ ఎన్నికల ప్రక్రియ సంపూర్ణంగా ముగియనుంది. తొలి విడతలో 17 రాష్ట్రాలు, నాలుగు కేంద్రపాలిత ప్రాంతాల్లోని మొత్తం 102 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరగనుంది. అందులో తమిళనాడులోని మొత్తం 39 స్థానాలు, రాజస్థాన్‌లోని 12 స్థానాలు, ఉత్తరప్రదేశ్‌లోని 8 స్థానాలు, మధ్యప్రదేశ్‌లోని 6 స్థానాలు, ఉత్తరాఖండ్, అసోం, మహారాష్ట్ర ల్లోని ఐదేసి స్థానాలు, బీహార్‌లోని నాలుగు స్థానాలు, పశ్చిమబెంగాల్‌లోని మూడు స్థానాలు, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, మేఘాలయల్లోని రెండేసి స్థానాలు, ఛత్తీస్‌గఢ్, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర, అండమాన్ నికోబార్ దీవులు, జమ్ముకశ్మీర్, లక్షద్వీప్, పుదుచ్చేరిల్లోని ఒక్కో స్థానం ఉన్నాయి. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం మార్చి 16న షెడ్యూల్ విడుదల చేసింది. మొత్తం ఏడు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఏప్రిల్ 19న తొలి విడత పోలింగ్, జూన్ 1న తుది విడత పోలింగ్ నిర్వహించనున్నారు. జూన్ 4న లోక్‌సభ ఎన్నికల ఫలితాలతోపాటు నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెల్లడి కానున్నాయి.

# ద్రోణి ఎఫెక్ట్..

**ఉరుములు, మెరుపులతో ఏపీలో వర్షాలు.. ఎక్కడెక్కడంటే..?**

ఝూర్ఖండ్ పరిసర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఒడిస్సామీదుగా ఉత్తర కోస్తా వరకు ద్రోణీ ఆవరించి ఉంది. వీటి ప్రభావంతో కోస్తాంధ్రాలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని విశాఖలోని వాతావరణశాఖ అధికారులు హెచ్చరించారు.కొన్ని చోట్ల పిడుగులు పడే అవకాశం ఉందని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉత్తర కోస్తా జిల్లాల్లోని ఇప్పటికే వర్షాలు కురుస్తున్నాయి. కాగా, శ్రీకాకుళం, విజయనగరం విశాఖ, అల్లూరి, మన్యం పార్వతీపురం జిల్లాలతో పాటు ఉభయ గోదావరి జిల్లాల్లోనూ ఓ మోస్తారు వర్షాలు పడతాయన్నారు.అదే విధంగా దక్షిణ కోస్తాలో తేలికపాటి వర్షం పడుతుందన్నారు. నిన్నటి నుంచి ఈ ఉదయం వరకు ఉత్తరాంధ్ర జిల్లాలోని కొన్నిచోట్ల భారీ వర్షాలు కూడా నమోదయ్యాయి. విజయనగరం జిల్లా గరివిడిలో 13 సెంటీమీటర్లు,, అల్లూరి జిల్లాలో 7 సెంటీమీటర్ల వర్షపాతం రికార్డ్ అయింది.మిగిలిన కొన్ని ప్రాంతాల్లో నాలుగు నుంచి ఐదు సెంటీమీటర్ల వర్షం కురిసినట్టు విశాఖలోని తుపాను హెచ్చరికల కేంద్రం డైరెక్టర్ సునంద తెలిపారు. ఇదిలా ఉంటే విశాఖ, అనకాపల్లి, పాడేరు ఏజెన్సీలోనూ లో ఉదయం నుంచి వర్షం పడుతోంది. చాలా చోట్ల ఆకాశం మేఘావృతమై జల్లులు పడుతున్నాయి.పొలాల్లో పనిచేసే రైతులు, వ్యవసాయ కులీలు, పశు-గొర్రెల కాపరులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని.. చెట్లు, టవర్స్, పోల్స్ కింద ఉండరాదన్నారు. పొలాలు, మైదానాలు మరియు ఇతర బహిరంగ ప్రదేశాల్లో ఉండకుండా.. సురక్షితమైన ప్రదేశాలను ఆశ్రయించాలని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ సూచనలు జారీ చేసింది.



# ఆళ్లగడ్డకు వచ్చిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర సమన్వయ కమిటీ...

**మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తో ఎమ్మెల్యే గంగుల**





ఆళ్లగడ్డ ప్రతినిధి మార్చి 20 విభారె న్యూస్ :- ఈనెల 28వ తేదీన ముఖ్యమంత్రి జగన్ మేమంతా సిద్ధం పేరుతో బస్సు యాత్ర చేపట్టనున్నారు. అందులో భాగంగా బుధవారనీ బస్సు యాత్ర సమన్వయ కమిటీ సభ్యులు ఆళ్లగడ్డకు చేరుకోవడం జరిగింది . మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ముఖ్యమంత్రి టూర్ కోఆర్డినేటర్ తలశిల రఘురాం తో పాటు ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ఈ కమిటీలో ఉన్నారు. ఆళ్లగడ్డ కు వచ్చిన వీరిని రాష్ట్ర జలవనరుల శాఖ సలహాదారుడు గంగుల ప్రభాకర్ రెడ్డి, శాసనసభ్యులు గంగుల నాని మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. అందరూ కలిసి పట్టణ శివారులోని శిల్ప వెంచర్ లోకి వెళ్లడం జరిగింది. జిల్లా పర్యటనలో భాగంగా నంద్యాల కు వస్తున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రాత్రి బస చేయాల్సి వస్తే శిల్ప వెంచర్ సౌకర్యంగా ఉంటుందా లేదా అని వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, నంద్యాల ఎమ్మెల్యే శిల్ప రవిచంద్ర రెడ్డి, ఎమ్మెల్సీ ఇస్సాక్ అహ్మద్, ఎమ్మెల్సీ రామ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పిఠాపురంలో జనసేనకు భారీ షాక్..

**వైఎస్సార్‌సీపీలోకి మాకినీడి శేషకుమారి**



తాడేపల్లిగూడెం: కాకినాడ జిల్లాలోనిపిఠాపురంలో జనసేనకు భారీ షాక్ తగిలింది. జనసేన పార్టీ మాజీ ఇంచార్జి మాకినీడి శేషకుమారి వైఎస్సార్‌సీపీలో చేరారు.బుధవారం తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఆమె వైఎస్సార్‌సీపీలో చేరారు. 2019 ఎన్నికల్లో జనసేన తరపున పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి శేషకుమారి పోటీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ పి.వి. మిథున్‌రెడ్డి, పిఠాపురం వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త వంగా గీత పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాకినీడి శేషకుమారి మీడియాతో మాట్లాడుతూ, గత ఎన్నికలలో 28 వేల ఓట్లు తనకు వచ్చాయని తెలిపారు.

'పవన్ పార్టీకి ఒక నిబద్ధతనేదే లేదు. పవన్‌ను జనం నమ్మే పరిస్థితి లేదు. జనసేనకి అసలు విధివిధానాలే లేవు. పిఠాపురం ప్రజల మనోభావాలను పవన్ అర్థం చేసుకోలేదు. జనాసేనలో అనేక సమస్యలు, ఇబ్బందులు ఉన్నాయి. సీఎం జగన్‌తో అసలు పవన్‌ను ఎవరూ పోల్చుకోరు. సీఎం జగన్ స్థాయి వేరు. పవన్ చెప్పే సిద్ధాంతాలు మైకుల ముందే పరిమితం. ఆచరణలో ఏమీ చేయరు' అని తెలిపారు.

**నన్ను జనసేనలోకి రమ్మనటం పవన్ అవివేకం:** డబ్బులతో రాజకీయం చేయాలని పవన్ అనుకుంటున్నారని పిఠాపురం నియోజకవర్గం? వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత అన్నారు. ఆమె బుధవారం మీడియాతో మాట్లాడారు. 'మేము గత ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసే ఓట్లేయమని అడుగుతాం. కాపు కుల మహిళా నేతగా పిఠాపురంలో నాకు మంచి ఇమేజ్ ఉంది. నాకు బంధువులు, స్నేహితులు పిఠాపురంలో చాలా ఎక్కువ. నన్ను తన పార్టీలోకి రమ్మనటం పవన్ అవివేకం. పవన్‌ను కూడా నేను మా వైఎస్సార్‌సీపీలోకి రమ్మంటే బావుంటుందా?. సీఎం జగన్ మీద జనానికి నమ్మకం ఉంది. ఆయన్ను ఢీకొనలేక మిగతా పార్టీలన్నీ కలిసి పోటీ చేస్తున్నాయి. అయినా గెలుస్తామన్న నమ్మకమే వారికి లేదు. పవన్‌కు అసలు రాజకీయాలపై క్లారిటీ లేదు. జనం డబ్బులకు అమ్ముడు పోతారని పవన్ వ్యాఖ్యలు చేయటం సరికాదు' అని వంగా గీత అన్నారు.

# తెలంగాణ గవర్నర్‌గా సీపీ రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారం..

**సీఎం రేవంత్‌తో ప్రత్యేక భేటీ**



హైదరాబాద్, మార్చి 20: తెలంగాణ ఇంఛార్జి గవర్నర్‌గా సీపీ రాధాకృష్ణన్ బుధవారం (మార్చి 20) ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ లోక్ ఆరాధే ఆయనతో ప్రమాణం చేయించారు.ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సహా హర్యానా గవర్నర్ దత్తాత్రేయ, రాష్ట్ర సీఎస్ ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ప్రస్తుత ఝూర్ఖంగ్ గవర్నర్‌గా కొనసాగుతోన్న రాధకృష్ణన్ నేటి నుంచి తెలంగాణకు ఇంఛార్జి గవర్నర్‌గా అదనపు బాధ్యతల్లో కొనసాగనున్నారు.తమిళిసై ఇటీవల తెలంగాణ గవర్నర్ పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. దీంతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనను నూతన ఇంఛార్జి గవర్నర్‌గా నియమించారు. ప్రమాణ స్వీకారం అనంతరం గవర్నర్తో రాధాకృష్ణన్ ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేకం గా భేటీ అయ్యారు. గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అంశాలు, రాష్ట్ర స్థితిగతులపై నూతన గవర్నర్ రాధాకృష్ణన్‌కు సీఎం రేవంత్ వివరించారు.కాగా రాధాకృష్ణన్ తమిళనాడు బీజేపీలో సీనియర్ నేత. గతంలో ఆ రాష్ట్రానికి బీజేపీ చీఫ్‌గా, కేరళ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జిగా పలు కీలక పదవుల్లో పనిచేశారు. తమిళనాడులోని కోయంబత్తూరు లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ తరపున పోటీ చేసి 2 సార్లు ఎంపీగా ఎన్నికయ్యారు. 2023 ఫిబ్రవరి 18 నుంచి ఆయన ఝూర్ఖండ్ గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఝూర్ఖంగ్‌తోపాటు తెలంగాణ ఇంఛార్జి గవర్నర్‌గా, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గానూ ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

# ఆంధ్రప్రదేశ్‌లో అరాచక పాలన

**జగన్ ఓటమే లక్ష్యంగా ఎన్‌డిఎకు మద్దతు**

**లోక్‌సత్తా అధినేత జయ ప్రకాశ్ నారాయణ**

అమరావతి,మార్చి20: ఆంధ్రప్రదేశ్‌లో అరాచక పాలన కొనసాగుతోందని లోక్ సత్తా అధినేత జయ ప్రకాశ్ నారాయణ మండిపడ్డారు. ఈ క్రమంలో జగన్‌ను ఓడించడమే లక్ష్యంగా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి మద్దతు ఇస్తున్నామని బుధవారం నాడు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీతో కలిసి బరిలోకి దిగుతామని జేపీ వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ పరిస్థితులు మరింత దిగజారాయని జయప్రకాశ్ నారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కులాల మధ్య పోరాటం జరుగుతోందని వివరించారు. వైసీపీ వైపు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు ఉంటే, కమ్మ, కాపులు విపక్షాల వైపు ఉన్నారని పేర్కొన్నారు. సుపరిపాలన అంటే సంక్షేమం మాత్రమే కాదన్నారు. అభివృద్ధి చేస్తేనే మంచి పాలన ఇచ్చినట్టు అవుతుందని అభిప్రాయపడ్డారు. అప్పులు తీసుకొచ్చి సంక్షేమం కోసం ఖర్చు చేయడం సరికాదని జేపీ సూచించారు. సంక్షేమమే పాలన అనుకుంటే ఆ దేశం, రాష్ట్రం అధోగతి పాలు కావడం ఖాయం అని హెచ్చరించారు. నేటి బాలలే రేపటి పౌరులు అంటారు. పిల్లల భవిష్యత్ గురించి ఆలోచించాలని జయప్రకాశ్ నారాయణ సూచించారు. పేదరికం సమూలంగా వెళ్లిపోవాలని, అప్పుడే అభివృద్ధి జరుగుతోందని పేర్కొన్నారు. సంక్షేమం అంటే తాత్కాలిక ప్రయోజనాలు అని, అభివృద్ధి అంటే దీర్ఘకాలిక సంపద సృష్టించడం అని జయప్రకాశ్ నారాయణ వివరించారు. ఉపాధి కల్పించి, పెట్టుబడులు అందజేసి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో కులాల గురించి ఎక్కువ ప్రస్తావన జరగడం విచారకరం అని జయప్రకాశ్ నారాయణ అభిప్రాయపడ్డారు. కులాలకు అతీతంగా పనిచేసే నేత లేరని పేర్కొన్నారు. గతంలో చాలామంది నేతలు కుల మతాలకు అతీతంగా సమాజం కోసం పనిచేశారని వివరించారు. కొందరు మూర్ఖులు, అజ్ఞానులుగా మారారని ధ్వజమెత్తారు. తప్పు ఎత్తి చూపితే చాలు కులం, మతం, ప్రాంతం పేరు తెరపైకి తీసుకొస్తు న్నారని పేర్కొన్నారు. అధికారంలో ఉన్న వారు నియంతలా వ్యవహరిస్తున్నారని జేపీ మండిపడ్డారు. మద్దతుగా ఉంటే పూల బాట, ప్రత్యర్థిగా ఉంటే ముళ్ల మార్గంగా మారుస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయి ప్రజలదే.. మన డబ్బు మన హక్కు అని వివరించారు. 'దేశానికి, ప్రజలకు మంచి జరగాలంటే ఆర్థిక ప్రగతి అవసరం. గత ఐదేళ్లుగా ఆంధప్రదేశ్‌లో ప్రగతి మాట లేకుండా పోయింది. ఐదేళ్లలో ఏపీ పేరు దిగజారిపోయింది. పెట్టుబడులు పెట్టేందుకు భయపడే పరిస్థితి వచ్చింది. దోపిడీ చేస్తూ.. సంక్షేమ పథకాలు అమలు చేశామని చెబుతున్నారు. ప్రజా పాలన ఇది కాదు అని' జేపీ ధ్వజమెత్తారు. ఒడిశా కన్నా దారుణంగా ఆంధప్రదేశ్ పరిస్థితి మారిందని జేపీ మండిపడ్డారు. 'ఒడిశాలో రూ.26 వేల కోట్ల రెవెన్యూ ఉంది. అవసరం మేరకు అప్పులు చేస్తారు.

# సంపాదకీయం

గురువారం 21-03-2024

## ఎలక్షన్ బాండ్స్ కు క్విడ్ ప్రోకో మరక

రాజకీయ పార్టీలకు బాండ్ల రూపంలో వచ్చిన నిధులకు సంబంధించి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెలువరించిన రెండు జాబితాలు దేశంలో ఇంకా కలకలం సృష్టిస్తూనే ఉన్నాయి. సుప్రీంకోర్టు అనేకసార్లు మొట్టికాయలు వేయడంతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దిగివచ్చింది. అస్పష్టంగా వివరాలు వెల్లడించింది. ఆ వివరాల ప్రకారం.. వివిధ రాజకీయ పార్టీల బాండ్లను కొనుగోలు చేసిన కంపెనీల చరిత్ర లోప భూయిష్టంగా ఉంది. నిధులు ఇచ్చిన వాటిలో చాలా కంపెనీలు పలు రకాల ఆరోపణలు ఎదుర్కొన్నవే ఉన్నాయి. వాస్తవానికి ఆరోపణలు ఉన్న కంపెనీలే అధిక బాండ్లు కొనుగోలు చేయడం.. ఆస్తులు అటాచ్ చేసిన వెంటనే బాండ్లు కొనుగోలు చేయడం.. అనుమానాలకు తావిస్తోంది.గేమింగ్ సంస్థ రాజకీయ పార్టీలకు పెద్ద ఎత్తున నిధులు అందిస్తోంది. ఈ సంస్థ గత ఐదు సంవత్సరాలలో 1368 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్లను కొనుగోలు చేసింది. అయితే ఈ పార్టీ ఇప్పటివరకు బాండ్లను ఏ పార్టీకి ఇచ్చిందనే వివరాలు తెలియ రాలేదు. ఈ సంస్థ ప్రధానంగా లాటరీ వ్యాపారం చేస్తుంది.. 2019లో ఈ సంస్థపై ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు విచారణ ప్రారంభించారు. ఆ ఏడాది జూలై నెలలో ఈ సంస్థకు చెందిన 250 కోట్ల ఆస్తులను ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు అటాచ్ చేశారు. 2022 ఏప్రిల్ 2న మరో 409.92 కోట్ల ఆస్తులనూ ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు అటాచ్ చేశారు. ఇది జరిగిన ఐదు రోజులకే అంటే ఏప్రిల్ 7న ఈ సంస్థ 100 కోట్ల విలువైన ఎన్నికల బాండ్లను కొనుగోలు చేసింది. ప్రధాన కంపెనీలతో పాటు అనుబంధ కంపెనీల ద్వారా వివిధ రాజకీయ పార్టీలకు ఆ సంస్థ రూ.2,318 కోట్లను విరాళాలుగా ఇచ్చింది. అయితే ఆ పార్టీలు పూర్తిగా అధికార పార్టీలే. బీజేపీ, బీఆర్ఎస్, వైఎస్ఆర్‌సీపీ, డీఎంకే వంటి పార్టీలకు విరాళాలు ఇచ్చింది. ఈ కంపెనీకి అంత భారీ నెట్ వర్క్ వ్యాపారం ఉంది. పెద్ద పెద్ద కాంట్రాక్టులు చేస్తూ ఉంటుంది. కృష్ణా రెడ్డికి చెందిన మేఘా గ్రూప్ అనేక కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల ప్రాజెక్టులను పొందింది. తెలంగాణలో గోదావరి నదిపై కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ప్రపంచంలోనే అతిపెద్దది. ఈ పథకంలో విస్తృతమైన అవకతవకలను కాగ్ ఎత్తిచూపింది. ఖజానాకు స్పష్టమైన నష్టం కలిగించిందని గుర్తించింది. రాష్ట్ర మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు, ముఖ్యంగా తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావుతో రెడ్డికి ఉన్న సాన్నిహిత్యం పై అనేక గుసగుసలు ఉన్నాయి. అయితే ఒక్క కాళేశ్వరం కాదు.. మేఘా కంపెనీ తెలంగాణ బయట కూడా ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు చేపట్టింది. రూ. 14,400 కోట్ల థానే-బోరివలి ట్విన్ టన్నెల్ ప్రాజెక్ట్‌ను కూడా చేపట్?టంది. ప్రాజెక్ట్ కోసం అతి తక్కువ బిడ్డర్‌గా అవతరించింది, ఆశ్చర్యకరంగా తక్కువ బిడ్‌కు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ నుండి ప్రశంసలు పొందింది. మేఘా గ్రూప్ రేడియో రిలే కంటైనర్‌లను సరఫరా చేయడానికి రూ. 500 కోట్ల విలువైన రక్షణ ప్రాజెక్టును కూడా గెలుచుకుంది . ఇక దేశవ్యాప్తంగా అనేక చోట్ల ఇన్‌ఫ్రా ప్రాజెక్టులు చేపడుతోంది. ఈ సంస్థ చేపట్టేవి అత్యధికం ప్రభుత్వ ప్రాజెక్టులు. ఒలెక్ట్రా పేరుతో ఎలక్ట్రిక్ బస్సులను మేఘగ గ్రూప ?తయారు చేస్తోంది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఎన్నికల సంఘం విడుదల చేసిన ఎలక్టోరల్ బాండ్ల డేటా ఎంఈఐఎల్ కి చెందిన మరో కంపెనీ, వెస్టన్ యుపి పవర్ ట్రాన్స్‌మిషన్ కంపెనీ లిమిటెడ్ కూడా భారీగా విరాళాలు అందించినట్లు రికార్డులు వెలుగులోకి వచ్చాయి. వెస్టన్ యుపి పవర్ ట్రాన్స్‌మిషన్ కంపెనీ లిమిటెడ్, ఎలక్టోరల్ బాండ్ల కొనుగోలుదారుల్లో ఏడవ స్థానంలో ఉంది. ఇది పశ్చిమ ఉత్తరప్రదేశ్ అంతటా ట్రాన్స్‌మిషన్ లైన్లను వేస్తున్న పవర్ ట్రాన్స్‌మిషన్ కంపెనీ. 220 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్లను కొనుగోలు చేసింది. మరో రెండు మేఘా గ్రూప్ కంపెనీలు, ఎస్ఈపిసి పవర్ , ఈవీ ట్రాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఏప్రిల్ 2019 , జనవరి 2024 మధ్య ఎలక్టోరల్ బాండ్ల ద్వారా రూ. 40 మరియు రూ. 6 కోట్లు విరాళంగా అందించాయి. మేఘాతరపున ఇ?చచే విరాళాలు అధికార పార్టీలకే ఎక్కువ ఉంటాయి. ఆయన ఇచ్చిన విరాళంలో అధిక మొత్తం బిజేపీ, బీఆర్ఎస్, వైసీపీ లకే అందింది. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా మాత్రమే కాకుండా.. ప్రూడెంట్ ఫండ్ ద్వారా కూడా రాజకీయ పార్టీలకు విరాళం ఇస్తున్నారు. మేఘా కంపెనీ వ్యవస్థాపకుడు పి.పిచ్చిరెడ్డి. పీపీ రెడ్డిగా ప్రసిద్ధుడు. రైతు బిడ్డగా వ్యాపారంలోని ప్రవేశించిన పీపీ రెడ్డి తొలినాళ్లలో ప్రభుత్వానికి చెందిన చిన్నచిన్న కాంట్రాక్ట్ వర్కులను నిర్వహించేవారు. 1989 కాలంలో మెగా ఇంజినీరింగ్ ఎంటర్‌ప్రైజెస్‌ను ప్రారంభించారు. అప్పట్లో చిన్న పట్టణాల్లో పైపుల నిర్మాణాలను కంపెనీ చేపట్టేది. ఆ తరువాతి కాలంలో కంపెనీ రోడ్ల నిర్మాణం, డ్యామ్స్, సహజ వాయువు, విద్యుత్, ఎలక్ట్రిక్ వాహనాలు, మెగా ఇంజనీరింగ్ వర్క్స్ వంటి అనేక ఇతర రంగాల్లోకి విస్తరించింది. అలా మౌలిక సదుపాయాల నిర్మాణ రంగంలో అనేక ప్రాజెక్టులను విజయవంతంగా నిర్మించి దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందింది.2006లో మెగా ఇంజనీరింగ్ ఎంటర్‌ప్రైజెస్ పేరును.. ఇంజనీరింగ్ ఌ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌గా మార్చారు. పీపీ రెడ్డి అల్లుడు పీవీ కృష్ణారెడ్డి 1991లో జతకట్టి కంపెనీని ముందుకు తీసుకెళ్లటంలో కీలకంగా వ్యవహరించారు. దేశ చరిత్రలో మైలురాయిగా నిలిచిన తెలంగాణలోని అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ను విజయవంతంగా నిర్మించింది. ప్రపంచం క్లీన్ ఎనర్జీ వైపు నడుస్తున్న తరుణంలో మెగా ఆధ్వర్యంలోని జాయింట్ వెంచర్ అయిన ఎలక్ట్రిక్ బస్సుల తయారీలో అగ్రగామిగా నిలిచింది. వీటి తయారీలో చైనా బీవైడీ నుంచి సాంకేతికతను కొనుగోలు చేసింది. అనేక రంగాల్లోకి విస్తరించిన మెగా ఇంజనీరింగ్ ఌ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ ఇతర సబ్సిడరీ కంపెనీలను సైతం కలిగి ఉంది. మెగా ఫైబర్ గ్లాస్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, ఎంఈఐఎల్ గ్రీన్ పవర్ లిమిటెడ్, వెస్టన్ యుపి పవర్ ట్రాన్స్మిషన్ కో. లిమిటెడ్, ఎస్ఈపిసి పవర్ ప్రైవేట్ లిమిటెడ్, జేసీఈ ఇంజనీరింగ్ ఌ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, ఎంఈఐఎల్ హోల్డింగ్స్ లిమిటెడ్, ఎంఈఐఎల్ ఫౌండేషన్ ఉన్నాయి. 36 ఏళ్ల కిందట కేవలం ఇద్దరు ఉద్యోగులతో ప్రారంభమైన కంపెనీ ప్రస్తుతం అత్యుత్తమమైన, ప్రతిష్ఠాత్మకమైన నిర్మాణాలను చేపడుతోంది. మనదేశంలో 16 రాష్ట్రాల్లో ఈ కంపెనీ వ్యాపారాలు విస్తరించి వున్నాయి. అంతేకాక భారత ఉపఖండం దాటి 10 దేశాల్లో కూడా తమ సత్తా చూపింది

## వారెవ్వా.. ఖమ్మం సీటు గెలిచేందుకు బీజేపీ మాస్టర్ స్కెచ్..

ఖమ్మం ఎంపీ సీటు .. తెలంగాణ రాజకీయాల్లో కాకరేపుతోంది. ప్రధానపార్టీలన్నీ కన్నేయడంతో ఉమ్మడిజిల్లాలో ఉన్న ఈ ఒకేఒక్క పార్లమెంటు సీటు? పొలిటికల్‌గా పొగలురాజేస్తోంది.సెగలు గక్కుతోంది. అప్ కీ బార్.. చార్ సౌ పార్ అంటున్న బీజేపీ ఈ దఫా దక్షిణాదిన దంచికొట్టాలని భావిస్తోంది. సౌత్‌కు ముఖద్వారం లాంటి తెలంగాణలో మెజార్టీ స్థానాలు గెలవాలన్న కసితో పనిచేస్తోంది కమలదళం. అందుకే ఖమ్మం గుమ్మంలో అభ్యర్థి ఎంపికపై




బీభత్సమైన కసరత్తు చేస్తున్నారు కాషాయ పెద్దలు.ఇప్పుడు దేశవ్యాప్తంగా ఎంత ఊపున్నా.. ఖమ్మంలో బీజేపీకి బలమైన నాయకత్వం లేదు. దీంతో, ఇటీవల బీఆర్ఎస్ నుంచి పార్టీలోకి వచ్చిన మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావుకే? ఖమ్మం ఎంపీ సీటు ఖాయమనే ప్రచారం జరిగింది. ఆయనను పార్టీలోకి తీసుకున్నది కూడా అందుకేనన్న ముచ్చటా వినిపించింది. కాకపోతే ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. అయితే, ఖమ్మం గెలవాలంటే క్యాస్ట్ ఈక్వెషన్స్ కచ్చితంగా ఫాలో అవ్వాల్సిందేనని కమలం పెద్దలు. .. కాస్త లేట్‌గా అయినా తెలుసుకున్నట్టు అనిపిస్తోంది. కమ్మ సామాజికవర్గంతో పాటు, ఏపీ బేస్డ్ పబ్లిక్ ఎక్కువగా ఉండే ఖమ్మంలో? పొలిటికల్ లెక్కలు వేరేలా ఉంటాయి. అందుకే, బలమైన కాంగ్రెస్ మూలాలు ఉన్న జలగం వెంకట్రావును కాస్త హోల్డ్‌లో పెట్టి? మరో నేత కోసం బీజేపీ ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. అయితే జలగం మాత్రం.. సీటు తనకే వస్తుందన్న ధీమా వ్యక్తం చేస్తున్నారు.ఏపీలో టీడీపీతో పొత్తు కుదిరింది కాబట్టి? దాన్ని ఖమ్మం సీటు విషయంలో అప్లయ్ చేయాలనుకుంటోంది బీజేపీ. టీడీపీకి వెన్నుదన్నుగా నిలిచే కమ్మవర్గం ఖమ్మంలో బలంగా ఉంది. కాబట్టి, అక్కడ టీడీపీ మూలాలు ఉన్న బలమైన నాయకుడి కోసం.. ఖమ్మం సీటును హోల్డ్‌లో పెట్టింది బీజేపీ. అయితే, ఖమ్మంలో టీడీపీ బేస్ ఉన్న బడా నాయకుడు నామా నాగేశ్వరరావు. ఆయనకు టీడీపీ నుంచి గెలుపొందిన హిస్టరీ కూడా ఉంది. అందుకే ఆయనైతే కచ్చితంగా ఈ సీటును గెలవగలమని అంచనా వేస్తోంది బీజేపీ. అయితే, సిట్టింగ్ ఎంపీగా ఉన్న నామాను మరోసారి తమ అభ్యర్థిగా ప్రకటించింది బీఆర్ఎస్. ప్రచారం కూడా మొదలైంది. అయినా సరే కమలం నేతలు ఆయనతో టచ్‌లో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. మరి, ఈ టచ్ పాలిటిక్స్‌తో ఏం జరగబోతోందన్నదే ఆసక్తి రేపుతోంది. ఖమ్మం బరిలో నామా బీఆర్ఎస్ నుంచే నిలబడతారా? బీజేపీ సైడ్ తీసుకుంటారా? అన్నదే ఇప్పుడు సస్పెన్స్. అనూహ్య పరిణామాలు జరిగితే బీఆర్ఎస్ ఏం చేస్తుందన్నది చూడాలి. సేమ్ టు సేమ్ బీజేపీ ఫార్ములాలోనే.. మరో కమ్మ సామాజికవర్గం నేతను బరిలో దింపుతుందా? అనేది తెలియాల్సి ఉంది.ఒకవేళ నామా సైడ్ మారిస్తే.. జలగం మళ్లీ బీఆర్ఎస్‌లోకి వెళ్తారా? లేక అధిష్ఠానం ప్రకటించిన అభ్యర్థికి మద్దతిస్తారా? అన్నదీ ఆసక్తికర విషయమే. అటు కాంగ్రెస్‌లో ఇప్పటికే టిక్కెట్ కోసం నేతల మధ్య వార్ నడుస్తోంది. పొంగులేటి ప్రసాద్‌రెడ్డి, మల్లు నందిని మధ్య నువ్వానేనా అన్నట్టుగా టిక్కెట్ వార్ నడుస్తోంది. అటు తుమ్మల తనయుడు కూడా సీటు కోసం గట్టిగానే ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్‌లోకి వెళ్లినా ప్రయోజనం ఉండదు కాబట్టి? జలగం తిరిగి గులాబీ గూటికి వచ్చేస్తారా? అన్నదీ చర్చనీయాంశంగానే మారింది.

## మహారాష్ట్ర - తెలంగాణ సరిహద్దులో హై అలర్ట్.. డ్రోన్ కెమెరాలతో నిఘా

న్యూఢిల్లీ, మార్చి 20:మహారాష్ట్ర గడ్చిరోలి ఎన్ కౌంటర్?తో తెలంగాణ మహారాష్ట్ర సరిహద్దు జిల్లాల పోలీసులు అలర్ట్ అయ్యారు. గడ్చిరోలి ఎన్ కౌంటర్?తో మావోలు ప్రాణహిత దాటి మహారాష్ట్ర నుండి తెలంగాణాలోకి ఎంట్రీ ఇచ్చేందుకు ప్రయత్నించే అవకాశం ఉందన్న నిఘా వర్గాల సమాచారంతో ప్రాణహిత తీరం వెంట హై అలర్ట్ ప్రకటించారు.మంగళవారం తెల్లవారుజామున మహారాష్ట్రలోని రేపనపల్లి వద్ద కొలమరక అటవీప్రాంతంలో జరిగిన ఎదురు కాల్పుల్లో ఉమ్మడి ఆదిలాబాద్?లో కీలక బాధ్యతల్లో ఉన్న కుమురంభీం-మంచిర్యాల డివిజన్ కమిటీ సభ్యుడు, మంగి ? ఇంద్రవెల్లి ఏరియా కమిటీ కార్యదర్శి వర్గీస్ , సిర్పూర్-చెన్నూరు ఏరియా కమిటీ కార్యదర్శి మక్తు, మావోయిస్టు మిలటరీ ప్లటూన్ సభ్యులు కుర్సెంగ రాజు, మెట్ట వెంకటేష్ లు హతమవడంతో మంగీ అభయారణ్యం, ప్రాణహిత సరిహద్దు మావోయిస్ట్ ప్రభావిత ప్రాంతాలపై నిఘా పెంచారు జిల్లా పోలీసులు.లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో అలజడి రేపేందుకు.. ఎన్నికలను అడ్డుకునేందుకు విధ్వంసం సృష్టించేందుకు పక్కా ప్రణాళికలు అమలు చేసే ప్రమాదం ఉందన్న నిఘా వర్గాల హెచ్చరికలతో ఉమ్మడి ఆదిలాబాద్ పోలీసులు అలర్ట్ అయ్యారు. ప్రాణహిత తీరం వెంట డ్రోన్ల సాయంతో నిఘాను కట్టుదిట్టం చేశారు. పెరీ పాయింట్?ల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మావోయిస్టుల చర్యలు తిప్పికొట్టేందుకు ఇటీవలే ఇరు రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారులు మంచిర్యాల జిల్లాలో ప్రత్యేక సమావేశమై వ్యూహరచన చేయగా.. వారం రోజుల



వ్యవధిలోనే ఉమ్మడి ఆదిలాబాద్ కమిటీ కీలక మావో నేతలను మట్టుబెట్టడంతో పోలీసులు పై చేయి సాధించినట్టుగా తెలుస్తోంది.ఈ ఘటనతో మావోయిస్ట్?లు ప్రతికార చర్యలకు పాల్పడే ప్రమాదం ఉందన్న నిఘా వర్గాల సమాచారంతో మరింత అలర్ట్ అయ్యారు పోలీసులు. మూడు రాష్ట్రాలకు కొరకని కొయ్యగా మారిన వర్గీస్?ను మట్టుబెట్టడంలో మహారాష్ట్ర సీ 60 బలగాలతో పాటు తెలంగాణ గ్రే హౌండ్ పోలీసుల పాత్ర ఉండటంతో మావోయిస్ట్?లు తెలంగాణ పోలీసులు టార్గెట్?గా దాడులకు పాల్పడే అవకాశం ఉందన్న సమాచారంతో సరిహద్దు ప్రాంతాల్లో హై అలర్ట్ ప్రకటించారు.మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లా ? తెలంగాణ మంచిర్యాల జిల్లా సరిహద్దులోని వేమనపల్లి, కోటపల్లి మండలాల ప్రాణహిత తీరం వెంట ఉన్న రీచులను వారం రోజుల క్రితం రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ క్షేత్రస్థాయిలో సందర్శించి సరిహద్దు పోలీసులను అప్రమత్తం చేయగా.. తాజాగా ప్రాణహిత సరిహద్దుకు కొద్ది దూరంలోనే ఎన్ కౌంటర్ చోటుచేసుకోవడం మరింత భద్రతను కట్టుదిట్టం చేశారు. మావోయిస్టుల కదలికలను పసిగట్టేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి డ్రోన్ కెమెరాలతో ప్రాణహిత తీరాన్ని నిశితంగా పరిశీలిస్తున్నారు. అడవుల్లో కూంబింగ్ చేస్తూనే ప్రాణహిత తీరం వెంట అణువణువు జల్లెడ పడుతున్నారు. తెలంగాణ మహారాష్ట్ర, ఛత్తీస్ గఢ్ రాష్ట్రాలకు ప్రధాన రహదారి మార్గంగా ఉన్న 63వ జాతీయ రహదారిపై పోలీసులు విస్తృత తనిఖీలు కొనసాగిస్తున్నారు.

## ఫ్రీ బీస్‌పై సుప్రీంలో పిటిషన్.. విచారణకు అంగీకరించిన సీజేఐ ధర్మాసనం..

న్యూఢిల్లీ, మార్చి 20: ఎన్నికల్లో రాజకీయ పార్టీల ఉచిత వాగ్దానాలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారించేందుకు సర్వోన్నత న్యాయస్థానం బుధవారం అంగీకరించింది. సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, మనోజ్ మిశ్రా ధర్మాసనం ఎదుట పిటిషనర్లలో ఒకరి తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది విజయ్ హన్సారియా ఎదుట పిటిషన్‌పై ప్రస్తావించారు. పిటిషన్లపై విచారణ జరిపి తీర్పును ఇవ్వాలని అవసరం ఉందని తెలిపారు. ఈ అంశంపై గురువారం విచారణ కొనసాగిస్తామని పేర్కొంది. త్వరలో లోక్‌సభ ఎన్నికలు జరుగనున్నాయని.. ఈ క్రమంలో పిటిషన్‌ను విచారించాల్సిన అవసరం ఉందని పిటిషనర్ అశ్విని ఉపాధ్యాయ్ తరఫున హాజరైన న్యాయవాది విజయ్ హన్సారియా వాదించారు.ఈ వాదనలను ధర్మాసనం పరిగణలోకి తీసుకున్నది. ఎన్నికల్లో ఉచితాలు ఇస్తామన్న రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని.. ఎన్నికల గుర్తులను జప్తు చేసేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని పిటిషన్ కోరారు. ఎన్నికల్లో రాజకీయ పార్టీలు ఏకపక్షంగా వాగ్దానాలు చేస్తున్నాయని.. రాజకీయంగా లబ్ధి పొందేందుకు ప్రజాకర్షక చర్యలను పూర్తిగా నిషేధించాలని.. ఈ విషయంలో ఎన్నికల సంఘం కఠినంగా వ్యవహరించేలా చూడాలని పిటిషనర్ కోరారు. ఈ విధానం ఎన్నికల ప్రక్రియ, పవిత్రతను దెబ్బతీస్తుందని ఆరోపించారు. అయితే, గతంలో పిటిషన్లపై సర్వోన్నత న్యాయస్థానం విచారణ జరిపింది.ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ప్రజలకు హామీలు ఇవ్వకుండా రాజకీయ పార్టీలను నిరోధించలేమని పేర్కొంది. ఉచితాల పేరుతో ప్రజాధనం వృథా కాకూడదని.. అదే సమయంలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందకూడదని తమ ఉద్దేశం కాదని అప్పటి సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ ధర్మాసనం పేర్కొంది.

## నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 10 వేలు నష్టపరిహారం ఇవ్వాలి : సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి




హైదరాబాద్ : రాష్ట్రంలో ప్రకృతి విపత్తు వల్ల నష్టపోయిన రైతాంగానికి ఎకరానికి రూ. 10 వేలు నష్టపరిహారం ఇవ్వాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో నిరంజన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రకృతి విపత్తు వల్ల నష్టపోయిన రైతాంగానికి ఎకరానికి రూ. 2500 నుంచి రూ. 3000 మధ్య ఇస్తే సరిపోతాయని నిర్ణయించాం. కానీ కేసీఆర్ రైతు పక్షపాతి కాబట్టి.. రైతులకు మించి ఏం ఉండదని ఎకరానికి రూ. 10 వేల నష్ట పరిహారం ఇచ్చారు అని నిరంజన్ రెడ్డి తెలిపారు. ఆ రోజు ఇదే రేవంత్ రెడ్డి, మిగతా కాంగ్రెస్ నాయకులు ఏం మాట్లాడారు..? పంట నష్టపోయిన రైతులకు రూ. 10 వేలు దేనికి సరిపోతాయి. రైతులకు ఏమైనా భిక్షం వేస్తున్నారా..? అని మాట్లాడారు. ఇప్పుడు ప్రకృతి విపత్తు వల్ల నష్టపోయిన రైతాంగానికి, పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతాంగానికి ఎకరానికి రూ. 10 వేలు కాంగ్రెస్ పార్టీ ఇవ్వాలని బీఆర్ఎస్ పార్టీ తరుపున డిమాండ్ చేస్తున్నాం అని సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు.మీ చర్యల వల్ల, కరెంట్.. నీళ్లు ఇవ్వక ఎండిపోయిన పంటలు ఎన్ని ఉన్నాయో లెక్కలు తీయాలి. అలాంటి రైతులకు కూడా రూ. 10 వేలు ఇచ్చేందుకు ప్రత్యేక జీవో తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నాం. ప్రత్యక్షంగా, పరోక్షంగా రెండున్నర కోట్ల మంది సేద్యాన్ని నమ్ముకొని బతుకుతున్నారు. వారందరినీ ఆదుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందన్నారు.100 రోజుల్లోనే రూ. 16,400 కోట్ల అప్పుప్రపంచంలోని సంపన్న దేశం అమెరికా నుంచి పేద దేశాల వరకు అప్పులు అనేది ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలో భాగం. అప్పులు చేసి సంపదను సృష్టిస్తారు. వారు అలా ఏకానమీని పెంచుకుంటారు. అప్పులు ఏదో కేసీఆర్ తన ఇంటి కోసం చేసినట్టు నీచంగా, చులకనగా మాట్లాడారు కాంగ్రెస్ నేతలు. కేసీఆర్ అప్పులు చేశాడు అని దుష్ప్రచారం చేసిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు 100 రోజుల్లోనే రూ. 16,400 కోట్లు ఎలా అప్పు చేశారు. ఏదైనా మాట్లాడే ముందు స్పృహతో మాట్లాడాలని రేవంత్‌కు నిరంజన్ రెడ్డి సూచించారు.

## జన్ అధికార్ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసిన పప్పు యాదవ్



పాట్నా: బీహార్ నాయకుడు పప్పు యాదవ్ లోక్‌సభ ఎన్నికలకు ముందు కీలక నిర్ణయం తీసుకున్నారు. జన్ అధికార్ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేశారు. బుధవారం ఢిల్లీలో అధికారికంగా ఆ పార్టీలో చేరారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఆశీస్సులతో తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసినట్లు పప్పు యాదవ్ తెలిపారు. ప్రస్తుతం రాహుల్ గాంధీని మించిన ప్రత్యామ్నాయం లేదంటూ ఆయనను ప్రశంసించారు. ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్‌తో తనకు ఎలాంటి విభేదాలు లేవని తెలిపారు. లాలూ, కాంగ్రెస్‌తో కలిసి లోక్‌సభ ఎన్నికలతోపాటు 2025లో జరిగే బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధిస్తామని అన్నారు.కాగా, పప్పు యాదవ్ గతంలో ఆర్జేడీ, సమాజ్‌వాదీ పార్టీ, లోక్ జనశక్తి పార్టీలో ఉన్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాల కారణంగా ఆర్జేడీ నుంచి ఆయనను బహిష్కరించారు. 2015 బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు నితీష్ కుమార్, లాలూ ప్రసాద్ యాదవ్ కూటమికి వ్యతిరేకంగా జన్ అధికార్ పార్టీని ఆయన స్థాపించారు.మరోవైపు లాలూ ప్రసాద్ యాదవ్, తేజస్వీ యాదవ్‌ను పప్పు యాదవ్ మంగళవారం కలిశారు. దీంతో ఆయన ఆర్జేడీ గూటికి తిరిగి రావచ్చన్న ఊహాగానాలు వినిపించాయి. అయితే జన్ అధికార్ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసిన పప్పు యాదవ్ ఆ పార్టీలో చేరారు.

## భారత ప్రజాస్వామ్యానికి రాబోయే లోక్‌సభ ఎన్నికలు కీలకం: సీతారాం ఏచూరి

న్యూఢిల్లీ: భారత్‌లోని లౌకిక , ప్రజాస్వామ్య వాదాన్ని పరీక్షించేందుకు రాబోయే లోక్‌సభ ఎన్నికలు కీలకమైనవని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరిఅన్నారు. ఎందుకంటే గడిచిన పదేళ్లలో ప్రజాస్వామ్య మూలస్తంభాలపై దాడి జరిగినట్లు



ఆయన ఆరోపించారు. ప్రతిపక్ష ఇండియా కూటమికి పాపులారిటీ వస్తోందని, అయితే ఎన్నికల్లో అన్ని పార్టీలకు అవకాశం దొరకడం బట్టి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ దేశ అస్థిత్వవాదానికి రాబోయే ఎన్నికలు నిదర్శనంగా నిలుస్తాయన్నారు. లౌకిక ప్రజాస్వామ్య వాదాన్ని నిలుపుకుంటామా లేదా అన్న విషయం వచ్చే ఎన్నికల్లో తెలుస్తుందన్నారు. రాజ్యాంగ విలువలపై గత పదేళ్లు దారుణమైన దాడి జరిగిందన్నారు.రాజ్యాంగంలోని మూలస్తంభాలపై కూడా అటాక్ జరిగిందన్నారు. రాజ్యాంగ్యాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలన్న ఉద్దేశంతో ఇండియా కూటమి పనిచేస్తోందన్నారు. వర్గ హింస ద్వారా ఓట్లు రాబట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు.

# రాయలసీమలో పట్టు సాధించేదేలా...

కడప, మార్చి 20 రాయలసీమలో వైఎస్ జగన్ కు ఎదురు లేదు. అది మొన్నటి వరకూ వినిపించిన టాక్. కానీ రాను రాను పరిస్థితుల్లో మార్పు కనిపిస్తుంది. క్రమంగా విపక్షాలు బలం పుంజుకుంటున్నాయి. అభ్యర్థుల మార్పు కావచ్చు. స్థానిక పరిస్థితులు సహకరించకపోవడం కావచ్చు. ఏది ఏమైనా ఈసారి రాయలసీమలో గతంలో వచ్చిన సీట్లు ఈసారి దక్కుతాయా? అన్న అనుమానాలు వైసీపీ నేతల్లోనే కలుగుతున్నాయి. వైసీపీ నేతల్లో నెలకొన్న విభేదాలతో పాటు క్యాడర్ లో అలుముకున్న అసంతృప్తి కూడా ఒక కారణంగా గుర్తించారని చెబుతున్నారు. వైసీపీకి ఓటు బ్యాంకు ఎక్కువగా ఉన్న రాయలసీమలోనే కొంత ఇబ్బందికరమైన పరిస్థితులు నెలకొన్నాయన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. నాలుగు జిల్లాల్లో... రాయలసీమలోని నాలుగు జిల్లాల్లో గత ఎన్నికల్లో ప్రస్తుత ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ కేవలం మూడు స్థానాలకే పరిమితమయింది. కడప జిల్లాలో పది పదికి పది స్థానాలను వైసీపీ కైవసం చేసుకుంది. కర్నూలు జిల్లాలోనూ ఫ్యాన్ పార్టీ గత ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేసింది. అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో మాత్రం కొన్ని స్థానాలను కోల్పోయింది. అనంతపురం జిల్లాలోని ఉరవకొండ, హిందూపురంతో పాటు చిత్తూరు జిల్లాలోని కుప్పం నియోజకవర్గంలో టీడీపీ గెలిచింది. మిగిలిన అన్ని స్థానాల్లో వైసీపీ విజయం సాధించింది. అంత పెద్ద సంఖ్యలో సీట్లు గెలవడం కారణంగానే వైసీపీకి గత ఎన్నికల్లో 151స్థానాలు దక్కాయి. అయితే ఈసారి కడప, అనంతపురం జిల్లాల్లో కొంత ఫ్యాన్ పార్టీకి ఇబ్బందికరమైన పరిస్థితులు నెలకొన్నాయని ఆ పార్టీ నేతలే చెబుతున్నారు. కడప జిల్లాలో రాజంపేట, కమలాపూర్, మైదుకూరు వంటి స్థానాల్లో టీడీపీ ఈసారి గట్టి పోటీ ఇచ్చే అవకాశాలున్నాయి. అయితే అనంతపురం జిల్లాలో మాత్రం టీడీపీకి ఎక్కువ సంఖ్యలో స్థానాలు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఈసారి ఐదారు స్థానాలకు మించి వైసీపీకి రావన్న అంచనాలు వినపడుతున్నాయి. చిత్తూరు, కర్నూలు జిల్లాలో కొంత పరవాలేదని అంటున్నారు. అదే జరిగితే సీమలో జగన్ పార్టీ అతి తక్కువ స్థానాలు దక్కే అవకాశముంది. ఈ ప్రభావం అధికారంలోకి రావడంపైన కూడ పడనుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. గ్రామీణ స్థాయిలో ఓటు బ్యాంకు వైసీపీకి బలంగా ఉన్నప్పటికీ వర్గ విభేదాలే ఆ పార్టీ కొంప ముంచేట్లు కనిపిస్తున్నాయి. నేతల మధ్య కొరవడిన సహకారంతో పాటు క్యాడర్ లో నెలకొన్న నిరాశ, నిస్పృహలు కూడా సీమలో జగన్ పార్టీ బలహీన పడటానికి కారణంగా చెబుతున్నారు. అయితే ఎన్నికలకు ఇంకా సమయం ఉండటంతో నష్ట నివారణ చర్యలు చేపడితే ఏదైనా మార్పు వచ్చే అవకాశముందని కూడా అంటున్నారు. రాప్తాడులో సిద్ధం సభ జరిగింది. ఈ సభ తర్వాత కూడా పరిస్థితుల్లో పెద్దగా మార్పు రాలేదంటున్నారు. రెడ్డి సామాజికవర్గం కూడా ఫ్యాన్ పార్టీ పట్ల గుర్రుగా ఉందంటున్నారు. ఇప్పటి వరకూ అయితే మాత్రం సీమలో కొంత పైచేయి వైసీపీదే అయినా గత ఎన్నికల్లో వచ్చిన సీట్లు మాత్రం రావదన్న అంచనాలు మాత్రం బలంగా వినిపిస్తున్నాయి.

# దుమ్మురేపుతున్న వివేకం

విజయవాడ, మార్చి 20 ఏపీలో ఎన్నికల పోరు మొదలైంది. తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీలు కలిసి పోటీ చేస్తున్నాయి. అధికార పార్టీ వైసీపీతో పోటీ పడుతున్నాయి. ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ రాజకీయ సభలు, నాయకుల ఆరోపణలు – ప్రత్యారోపణలతో ఆ వాతావరణం వేడెక్కుతోంది. ముఖ్యంగా ప్రచార పర్వం రణరంగాన్ని తలపించేలా సాగుతున్నాయి. ఏపీలోని రాజకీయ రణరంగం వెండితెరకూ పాకింది. వైసీపీకి మద్దతుగా మహి వి రాఘవ్ 'యాత్ర 2', రామ్ గోపాల్ వర్మ 'వ్యూహం', 'శపథం' సినిమాలు తీశారు. వైసీపీకి వ్యతిరేకంగా 'రాజధాని ఫైల్స్' వచ్చింది. ఇప్పుడు మరో సినిమా, వైఎస్ వివేకానంద రెడ్డి బయోపిక్ 'వివేకం' రాబోతోంది. మార్చి 22న యూట్యూబ్ / వెబ్‌సైట్‌లో ఈ సినిమా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం సోషల్ మీడియాను ట్రైలర్ షేక్ చేస్తోంది.వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు ఏపీ, తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం సృష్టించింది. తొలుత గుండెపోటుతో మరణించారని వెల్లడించారు. ఆ తర్వాత గొడ్డలి పోటుకు ప్రాణం పోయిందని స్పష్టమైంది. ప్రస్తుతం ఈ కేసు విచారణలో ఉంది. వైఎస్ వివేకా హత్య కేసులో సీబీఐ దాఖలు చేసిన ఛార్జ్ షీట్, సీబీఐకి అప్రూవర్ దస్తగిరి ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా 'వివేకం' చిత్రాన్ని తెరకెక్కించినట్లు ట్రైలర్ ప్రారంభంలో పేర్కొన్నారు. 'మేం కొత్త పార్టీ పెట్టాలని అనుకుంటున్నాం... నాయన పేరు మీద' అని 'వివేకం' ట్రైలర్ ప్రారంభంలో డైలాగ్ వినిపించింది. వైఎస్ జగన్ పాత్రధారి డైలాగ్ అన్నమాట. ఆ తర్వాత 'మీ నాయనకు, నాకు రాజకీయ భవిష్యత్ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ' అని వివేకా స్పష్టం చేస్తారు. 'పార్టీలోకి రాకపోతే మేమే నీకు ఎదురు నిలబడాల్సి వస్తుంది' అని వివేకాకు విజయమ్మ ఎదురు నిలబడటం, ఆ తర్వాత తన కుమారుడికి మద్దతు ఇవ్వమని కోరడం వంటివి చూపించారు. వివేకా హత్యకు గురైన తర్వాత జగన్ ప్రెస్ మీట్ కూడా చూపించారు. వివేకా హత్యకు ఏ విధంగా ప్రణాళిక వేశారు? ఆ తర్వాత ఏమైంది? వంటి విషయాల్ని ప్రధానాంశంగా తీసుకుని సినిమా చేసినట్లు సులభంగా చెప్పవచ్చు.

# పలమనేరులో గెలుపు ఎవరది

తిరుపతి, మార్చి 20 ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సీనియర్ నాయకులలో అమర్ నాథ్ రెడ్డి ఒకరు. ఆయన పై గత ఎన్నికల్లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సిఫారసుతో నిలబడిన సాధారణ నాయకుడు వెంకటేష్ గౌడ్ గెలుపొందారు. ఈ సారి కూడా ఆయనకే టిక్కెట్ ఖరారు చేసారు. ఎన్నికల్లో ఎవరు విజయం సాధిస్తారనేది ఆసక్తి గా మారింది. పలమనేరు నియోజకవర్గం కర్ణాటక రాష్ట్ర సరిహద్దు. ఇక్కడ ఉన్న మండలాల్లో చాల వరకు కర్ణాటక రాష్ట్రంలోనే ఉపాధి, ఉద్యోగాలు సాధించి ఉంటారు. పలమనేరు, గంగవరం, బైరెడ్డిపల్లె, పెద్దపంజాణి వెంకటగిరి కోట (వి.కోట) మండలాలు ఉన్నాయి. 2019 నాటికి ఈ నియోజకవర్గంలో మొత్తం 2,55,870 మంది ఓటర్లు ఉన్నారు.మాజీ మంత్రి అమర్ నాథ్ రెడ్డి వారసత్వంగా తండ్రి నుంచి రాజకీయ ప్రవేశం చేశారు. 2009 ఎన్నికల్లో టీడీపీ నుంచి అమర్ నాథ్ రెడ్డి పోటీ చేసి గెలుపొందారు. తర్వాత మొదట కాంగ్రెస్‌కు.. వైఎస్ చనిపోయినతర్వాత వైసీపీ గూటికి చేరి ఎమ్మెల్యే అయ్యారు. రాష్ట్ర విభజన తర్వాత 2014 ఎన్నికల్లోనూ గెలిచారు. 2016 లో వైసీపీ నుంచి ఎమ్మెల్యే హోదా లో టీడీపీ పార్టీ లో చేరారు. ఆ తరువాత జరిగిన మంత్రిమండలి సర్దుబాటు లో పరిశ్రమలు, ఆహార శుద్ధి, అగ్రి బిజినెస్, కామర్స్, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖల మంత్రిగా భాద్యతలు చేపట్టారు. 2019 ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ప్రస్తుతం 2024 ఎన్నికల్లో టీడీపీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థి బరిలో ఉన్నారు.ఎన్.వి.జి ట్రస్ట్ పేరిట నియోజకవర్గంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వైసీపీ పార్టీ నాయకుడిగా ఎదిగారు. సాధారణ నాయకత్వం నుంచి 2019 ఎన్నికల్లో వైసీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. రాజకీయంగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్న ఆయన రెండో సారి వైసీపీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థి బరిలో నిలిచారు.వైసీపీ పార్టీ నుంచి పోటీ చేస్తున్న అభ్యర్ది పై ఆ పార్టీ నాయకులు అసంతృప్తిలో ఉన్నారు. నియోజకవర్గంలో నాయకులకు ఎలాంటి పనులు చేయలేదని. పార్టీ తరపున నామినేటెడ్ పదవులు సైతం లేవని. గతంలో నుంచి పార్టీ కోసం పని చేసిన సీనియర్లను పట్టించుకోవడం లేదని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యమని. అమర్ నాథ్ రెడ్డి సమయంలో వేసిన పునాదులు ఏవి చేయలేదని. నిరుద్యోగులకు ఎటువంటి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోలేదని అంటున్నారు. మరో వైపు మన రాష్ట్రం నుంచి కర్నాటక కు అధిక ధరలకు ఇసుక అమ్ముకున్నారని., వైసీపీ నాయకులు అక్రమ మద్యం తరలించేందుకు సహకరించారనే ఆరోపణలు ఉన్నాయి. కాగా వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి ప్రజలకు అందించిన పథకాలు, అభివృద్ధితో ప్రజలు తనను గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేస్తున్నారు. అమర్ నాథ్ రెడ్డి .. తన పార్టీ నాయకులను కలుపుకోవడం లో కొంత విఫలమయ్యారని, కష్ట సమయంలో వారికి అండగా నిలబడకుండా తప్పించుకున్నారని అంటున్నారు. టీడీపీ పార్టీ గ్రామ స్థాయిలో బలంగా ఉన్న నాయకత్వ లోపం కారణంగా కొంత అసంతృప్తితో ఉన్నారు. జనసేన నాయకులు కొంత మేర ఉన్న వారు పొత్తులో భాగంగా తప్పనిసరి టీడీపీ కి మద్దతు ఇస్తున్నారు. కాగా టీడీపీ నుంచి ఆశించిన స్థాయిలో ప్రచారంలో మాత్రం దూకుడు కనిపించడం లేదు. బీజేపీ ఊసే లేకపోవడం గమనార్హం. గతంలో తాను నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి.. టీడీపీ హామీలు తనను విజయం సాధించేలా చేస్తాయని అంటున్నారు.

# తేలని పొత్తుల పంచాయితీ

విజయవాడ, మార్చి 20 పొత్తుల పంచాయతీ ఏమో కానీ జనసేన బీజేపీ పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు కొత్త సమస్యను తెరపైకి తెచ్చింది. ఒకవైపు జనసేన బీజేపీ కలిసి పోరాటం చేయాలని ఏపీలో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదగాలని భావిస్తోంది. అందులో భాగంగానే ప్రత్యామ్నాయ కూటమితో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని పదేపదే పవన్ కళ్యాణ్ ప్రకటన చేస్తున్నారు. మరోవైపు పవన్ ప్రకటనను స్వాగతిస్తున్న జనసేన పార్టీ నేతలు.. బిజెపికి సీట్లు ఇచ్చేందుకు మాత్రం ముందుకు రావడం లేదు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా జనసేన పార్టీ తరఫున దాదాపు సీట్ల ఖరారు పూర్తయింది. అనుకున్న నియోజకవర్గాల్లో బిజెపి కోసం జనసేన సీట్లను త్యాగాలు చేయాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ విషయాన్ని స్వయంగా పవన్ కళ్యాణ్ కార్యకర్తల సమావేశంలో ప్రకటించారు. అయితే దీనిపై ఇప్పుడు ఆ పార్టీ నేతలు అధినేత పవన్ కళ్యాణ్?పై తిరుగుబాటుకు సిద్ధమవుతున్నారు.ఎన్నో అంచనాల నడుమున జనసేన పార్టీతో కలిసి ఇంతకాలం అడుగులు వేస్తే.. ఇప్పుడు బిజెపి కోసం తమను త్యాగాలు చేయమని కోరడం ఏంటని నేతలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వంపై పెద్ద పోరాటాన్ని జనసేన పార్టీ తరఫున చేస్తే.. సీట్ల సర్దుబాటు పేరుతో పక్కనపెడితే తమ రాజకీయ భవిష్యత్తు ఏమైపోవాలి అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అయితే సీట్లు సర్దుబాటు ప్రక్రియ దాదాపు పూర్తయిన నేపథ్యంలో ఇటు పక్క పార్టీలోకి పోలేక అలా అని అధికార పార్టీలోకి వెళ్లలేక అయోమయ స్థితిలోకి వెళ్లారు జనసేన పార్టీలోని కొందరు నేతలు. ఇప్పుడు సీట్ల సర్దుబాటులో బిజెపి కోసం త్యాగాలు చేస్తే.. జనసేనకు మంచి భవిష్యత్తు ఉంటుందని అధినేత హామీ ఇచ్చినా కూడా.. బిజెపి తమకు ఎంత మేర నియోజకవర్గంలో ప్రాధాన్యత ఇస్తుంది అనేది వారికి ప్రశ్నగా మారింది. రెండు పార్లమెంట్, అలాగే అసెంబ్లీ సెగ్మెంట్ల విషయంలో త్యాగాలు చేసిన నేపథ్యంలో అయా నియోజకవర్గాల్లో గెలుపు ఓటముపై జనసేన నాయకులు లెక్కలు వేసుకుంటున్నారు.

# జనసేనలోకి వంగవీటి..



విజయవాడ, మార్చి 20 : ఏపీలో రాజకీయాలు హీట్ ఎక్కుతున్నాయి. అన్ని పార్టీలు దూకుడు పెంచుతున్నాయి. ఈ తరుణంలో నేతలు భవిష్యత్తును వెతుక్కుంటూ పార్టీల్లో చేరుతున్నారు. తాజాగావంగవీటి రాధాకృష్ణ జనసేన లో చేరతారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. జనసేనకు పొత్తులో భాగంగా 21 స్థానాలను కేటాయించిన సంగతి తెలిసిందే. అందులో కృష్ణాజిల్లా అవనిగడ్డ ఉంది. ఆ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని రాధా భావిస్తున్నట్లు సమాచారం. జనసేన తరపున పోటీ చేస్తున్న ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి మధ్యవర్తిత్వంతో రాధా జనసేనలో చేరనున్నట్లు తెలుస్తోంది.గత ఎన్నికల్లో విశాఖ సెంట్రల్ నియోజకవర్గం వైసీపీ తరఫున రాధా టికెట్ ఆశించారు. కానీ జగన్ టికెట్ ఇవ్వలేదు. మల్లాది విష్ణుకు కేటాయించడంతో తీవ్ర మనస్థాపానికి గురైన రాధా టిడిపిలో చేరారు. అప్పటికే తెలుగుదేశం పార్టీలో అభ్యర్థులు ఖరారు అయ్యారు. దీంతో ఆయన టిడిపి తరఫున ప్రచారానికి పరిమితం అయ్యారు. ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఓడిపోయింది. దీంతో రాధా సైలెంట్ అయ్యారు. యాక్టివ్ రాజకీయాలకు దూరమయ్యారు. ఈ ఎన్నికల్లో సైతం తెలుగుదేశం పార్టీ ఆయనకు టికెట్ కేటాయించలేదు. ఆయన ఆశిస్తున్న విజయవాడలోని నగర నియోజకవర్గాల్లో దాదాపు అభ్యర్థులు ఖరారు అయ్యారు. అటు వైసీపీ సైతం అభ్యర్థులను ప్రకటించింది. ఈ తరుణంలో రాధా చుట్టూ రకరకాల ప్రచారం జరిగింది. వైసీపీలోకి వెళతారని ఒకసారి.. జనసేనలో చేరతారని మరోసారి పెద్ద ఎత్తున టాక్ నడిచింది. కానీ ఆయన ఏ పార్టీలో చేరలేదు. అయితే ఇప్పుడు వల్లభనేని బాలశౌరి రిక్వెస్ట్ చేయడంతో జనసేన లో చేరతారని తెలుస్తోంది.2004లో రాజశేఖర్ రెడ్డి ప్రోత్సాహంతో విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి తొలిసారిగా రాధాకృష్ణ పోటీ చేశారు. ఎమ్మెల్యేగా గెలిచారు. 2009లో ప్రజారాజ్యం పార్టీలో చేరారు. ఆ పార్టీ తరఫున పోటీ చేసి ఓడిపోయారు. 2014లో వైసీపీలో చేరారు. ఆ పార్టీ తరఫున పోటీ చేసి ఓడిపోయారు. 2019 ఎన్నికల్లో టికెట్ దక్కకపోవడంతో టీడీపీలోకి వెళ్లారు. అప్పటినుంచి టిడిపిలో కొనసాగుతున్నా యాక్టివ్ గా లేరు. ఈ ఎన్నికల్లో విజయవాడ తూర్పు నుంచి టిడిపి అభ్యర్థిగా పోటీ చేస్తారని టాక్ నడిచింది. కానీ హై కమాండ్ గద్దె రామ్మోహన్ రావు పేరును ప్రకటించింది. దీంతో రాధాకృష్ణను వైసీపీలోకి తీసుకెళ్లి మచిలీపట్నం ఎంపీ టిక్కెట్ కేటాయిస్తారని ప్రచారం జరిగింది. కానీ అక్కడ కూడా వైసీపీ అభ్యర్థుల ప్రకటన పూర్తయింది. ఈ తరుణంలో తాజాగా మరో వార్త బయటకు వచ్చింది. రాధా జనసేనలో చేరి అవనిగడ్డ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారని ప్రచారం జరుగుతోంది. మచిలీపట్నం సిట్టింగ్ ఎంపీ వల్లభనేని బాలశౌరి జనసేనలో చేరిన సంగతి తెలిసిందే. దీంతో ఆయన రాధాను జనసేనలోకి తీసుకెళ్లి అవనిగడ్డ అసెంబ్లీ టికెట్ కేటాయించేలా జనసేన నాయకత్వం పై ఒత్తిడి పెంచుతున్నట్లు సమాచారం. మరి ఇందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# మోడీ..ఆచితూచి అడుగులు



విజయవాడ, మార్చి 20 ఆంధ్రప్రదేశ్ లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఏర్పడింది. వచ్చే ఎన్నికలకు మూడు పార్టీలు కలసి వెళుతున్నాయి. కాని ఒకరిపై ఒకరికి నమ్మకం లేదు. పార్టీ అగ్రనాయకత్వం నుంచి కింది స్థాయి క్యాడర్ వరకూ అనుమానాలు. నిజంగా పొత్తు ఉందా? అన్న సందేహాలు ఆ పార్టీల క్యాడర్ లో కనిపిస్తుండటం ఇప్పుడు నేతల్లో ఆందోళన కలిగిస్తుంది. ఒక పార్టీ నుంచి మరొక పార్టీకి ఓట్లు బదిలీ అవుతాయా? అన్న అనుమానాలు అందరిలోనూ ఉన్నాయి. చిలకలూరిపేటలో జరిగిన సభతో తొలిగిపోవాల్సిన అనుమానాలు మరింత పెరిగినట్లే కనిపిస్తుంది. అసలు బీజేపీ తమతో మనస్ఫూర్తిగా పొత్తు పెట్టుకుందా? అన్నది తెలుగుదేశం పార్టీ నేతలను వేధిస్తున్న ప్రశ్న. వాళ్లకు కూడా అలవాటే.. అర్థమయిందా రాజా? డీలా పడ్డ నేతలు... ఎందుకంటే మోదీ వ్యవహారశైలి చూస్తుంటే జగన్ ను రాజకీయంగా దూరం చేసుకునే పరిస్థితి మాత్రం కనిపించడం లేదంటున్నారు. అందుకే ఆయన జగన్ పై విమర్శలు చేయకుండా దాటవేసి వెళ్లిపోయారంటున్నారు. చంద్రబాబును ప్రశంసించడం కాదు వాళ్లకు కావాల్సింది.. జగన్ ను దూషించడం.. విమర్శించడం.. కానీ అది మాత్రం జరగలేదు. ఆ ఒక్కటీ అడక్కు అన్నట్లు ఆయన సభలో పాల్గొని వెళ్లిపోయారు. సభలో మోదీ ప్రసంగం ప్రారంభమయ్యే వరకూ ఉత్సాహంగా ఉన్న టీడీపీ, జనసేన నేతలు అది ముగిసిన తర్వాత మాత్రం డీలా పడ్డారని చెప్పాలి. కానీ ప్రధానికి చెప్పేదెవరు? ఆయనను డైరెక్ట్ చేయగలిగిన సత్తా, శక్తి ఇక్కడ ఎవరికి ఉంది? ఆలింగనంతో అనుమానాలు... ఇప్పుడు అదే అనుమానం మరింత బలపడింది. బీజేపీతో చంద్రబాబు పొత్తు పెట్టుకుంది ఓట్లు వచ్చి పడతాయి అని కాదు... ఎలక్షనీరింగ్ కోసమే. ఎన్నికల్లో వైసీపీ ఎలాంటి ఇబ్బందులను పెట్టకుండా నిరోధించేందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సాయపడుతుందనే ఆయన పొత్తుకు సిద్ధమయ్యారు. ఎంతో కాలం వేచి ఉండి మరీ ఆలింగనం చేసుకున్నారు. కానీ ఆ ఆలింగనం పైపైకే అని ఇప్పుడిప్పుడే టీడీపీ నేతలకు అర్థమవుతుందట. దక్షిణాదిని నాలుగు సీట్లు గెలుచుకోవాలన్న ఉద్దేశ్యంతోనే తమతో పొత్తు పెట్టుకున్నారన్న విషయం అర్థమయ్యేలోగా అంతా జరిగిపోయిందని ఒక తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత వాపోతుండటం విశేషం. కేసీఆర్ హయాంలో మాదిరిగానే? నాటి పరిస్థితులకు... 2014 ఎన్నికల పరిస్థితులకు.. నేటికి చాలా వ్యత్యాసం ఉంది. అప్పుడు మోదీ అధికారంలోకి రాలేదు. అప్పటి వరకూ చంద్రబాబు రాజకీయాల్లో సీనియర్. పవన్ నేరుగా పోటీ కూడా చేయలేదు. కేవలం మద్దతు మాత్రమే ఇచ్చారు. కానీ ఇప్పుడు అలా కాదు. మోదీ స్ట్రాంగ్ అయ్యారు. ఆయనకు ఎవరు ఏంటో తెలుసు. మోదీ చంద్రబాబును నమ్మరు. అలాగే చంద్రబాబు మోదీని విశ్వసించరు. ఇద్దరికీ పవన్ కల్యాణ్ పై పెద్దగా ఆశలు లేవు. పవన్ ఒక్కరే వారిద్దరినీ గుడ్డిగా నమ్ముతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కూటమిలోని మూడు పార్టీల ఓట్లు ఏ మేరకు బదిలీ అవుతాయన్న చర్చ టీడీపీలో బాగానే జరుగుతుంది. ఒకసారి పొత్తులో భాగంగా నియోజకవర్గంలో పట్టు కోల్పోతే ఇక భవిష్యత్ లో తమకు రాదన్న భయం టీడీపీ నేతల్లో కూడా ఉంది. అందుకే నేతలను ఎంతగా బుజ్జగించినా.. సముదాయించినా.. మనసులో మాత్రం అనుమానాలు.. రాజకీయ భవిష?యత్ పై మాత్రం అలాగే ఉన్నాయి.

# నేడు ప్రపంచ అటవీ దినోత్సవం

ప్రపంచ అటవీ దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి 21 న నిర్వహించబడుతుంది. 2012, నవంబరు 28న యునెస్కో వారిచే తీర్మానించబడిన ప్రపంచ అటవీ దినోత్సవం, 2013 మార్చి 21న తొలిసారిగా నిర్వహించబడింది. ప్రస్తుత మరియు ముందు తరాల వారికి అడవుల ప్రాముఖ్యత, ప్రయోజనాలను తెలియజేయడంకోసం ఈ దినోత్సవం రోజున వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తారు. అంతర్జాతీయ అటవీ దినోత్సవం నవంబర్ 28, 2013న ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ తీర్మానం ద్వారా మార్చి 21వ తేదీన స్థాపించబడింది. ప్రతి సంవత్సరం, వివిధ కార్యక్రమాలు జరుపుకుంటారు మరియు అన్ని రకాల అడవుల ప్రాముఖ్యతపై అవగాహన పెంచుతారు , మరియు ప్రస్తుత మరియు భవిష్యత్తు తరాల ప్రయోజనాల కోసం అడవుల వెలుపల చెట్లు. అంతర్జాతీయ అటవీ దినోత్సవం రోజున అడవులు మరియు చెట్లతో కూడిన చెట్ల పెంపకం ప్రచారాలు వంటి స్థానిక, జాతీయ మరియు అంతర్జాతీయ కార్యకలాపాలను నిర్వహించడానికి ప్రయత్నాలను చేపట్టాలని దేశాలు ప్రోత్సహించబడ్డాయి. అడవులపై ఐక్యరాజ్యసమితి ఫోరమ్ యొక్క సెక్రటేరియట్ , సహకారంతోఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ , ప్రభుత్వాలు, అడవులపై సహకార భాగస్వామ్యం మరియు అంతర్జాతీయ, ప్రాంతీయ మరియు ఉపప్రాంతీయ సంస్థల సహకారంతో ఇటువంటి కార్యక్రమాల అమలును సులభతరం చేస్తుంది . అంతర్జాతీయ అటవీ దినోత్సవం మొదటిసారిగా మార్చి 21, 2013న నిర్వహించబడింది.ప్రతి సంవత్సరం 13 మిలియన్ హెక్టార్ల (32 మిలియన్ ఎకరాలు) కంటే ఎక్కువ అడవులు పోతున్నాయి, ఈ ప్రాంతం దాదాపు ఇంగ్లండ్ పరిమాణంలో ఉంటుంది . అడవులు వెళ్ళినట్లే, అవి స్వీకరించే వృక్ష మరియు జంతు జాతులు కూడా వెళ్తాయి

# కూటమికి మందా మద్దతు

విజయవాడ, మార్చి 20 ఏపీ ఎన్నికల్లో దళితులు ఎటువైపు? వైసీపీ వైపు వెళ్తారా? కూటమి వైపు టర్న్ అవుతారా? బలమైన చర్చ ఇప్పుడు నడుస్తోంది. అయితే దళితుల్లో చీలిక వచ్చి తలోవైపు ఉంటారన్న సంకేతాలు వెలువడుతున్నాయి. ప్రధానంగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ బాహటంగానే ఎన్డీఏకు మద్దతు తెలిపారు. దీంతో మాదిగలు కూటమి వైపు నడిచే అవకాశం ఉంది. మాలలు మాత్రం వైసిపి వైపు అడుగులేస్తారన్నది బహిరంగ రహస్యం. 29 రిజర్వుడు నియోజకవర్గాల్లో వైసిపి 19 స్థానాలను మాలలకు కేటాయించింది. మాదిగలకు కేవలం పది స్థానాలకే పరిమితం చేసింది. దీన్నిబట్టి ఆ పార్టీ ప్రాధాన్యత తెలుస్తోంది. ఈ తరుణంలోనే మంద కృష్ణ మాదిగ ప్రత్యేక ప్రకటన చేయడం విశేషం.కాంగ్రెస్ పార్టీకి దళితులు బలమైన మద్దతు దారులుగా నిలుస్తూ వచ్చారు. ఉమ్మడి ఏపీలో జాతీయ పార్టీగా ఉన్న కాంగ్రెస్ వైపు అడుగులు వేశారు. ఎన్టీఆర్ టిడిపి స్థాపించినప్పుడు మిగతా వర్గాలు ఆ పార్టీకి అండగా ఉన్నా.. దళితులు మాత్రం కాంగ్రెస్ పార్టీ నే తమ పార్టీగా చూసుకున్నారు. అందుకే చంద్రబాబు హయాంలోమాదిగ రిజర్వేషన్లకు జై కొట్టారు.మాదిగల అభిమానాన్ని చూరగొన్నారు.

## వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు....



ఎమ్మిగనూరు మార్చి 20 విభారె న్యూస్..ఎమ్మిగనూరు పట్టణంలోని మిలిటరీ కాలానికి చెందిన 31వ వార్డు వైసీపీ మాజీ కౌన్సిలర్ అన్నపూర్ణమ్మ వారి అనుచరులు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వర రెడ్డి సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. పార్టీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ లోకి మాజీ ఎమ్మెల్యే...



కోడుమూరు మార్చి 20 విభారె న్యూస్..కోడుమూరు మాజీ ఎమ్మెల్యే మురళికృష్ణ వైసీపీని వీడారు. బుధవారం హైదరాబాద్ లో ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వైసీపీ ఈ సీటును ఆదిమూలపు సతీష్ కు కేటాయించడంతో ఆయన నిరసన వ్యక్తం చేశారు. సీటు రాదని భావించి షర్మిల సమక్షంలో కాంగ్రెస్ లో చేరిపోయారు...

## మేమంతా సిద్ధం కార్యక్రమ సమన్వయ సమావేశం..



కర్నూలు మార్చి 20 విభారె న్యూస్..కర్నూల్ లో "మేమంతా సిద్ధం" సమన్వయ సమావేశం ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పాల్గొన్న ఎమ్మెల్సీ, ముఖ్యమంత్రి టూర్ కోఆర్డినేటర్ తలశిల రఘురాం హాజరైన కర్నూల్, నంద్యాల పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ సమన్వయకర్తలు, నియోజకవర్గ పరిశీలకులు తదితరులు "మేమంతా సిద్ధం" సభలు విజయవంతం చేయడం పై దృష్టి కార్యక్రమంలో భాగంగా సిద్ధం సభల పోస్టర్ ఆవిష్కరణ, ఈకార్యక్రమంలో ఎమ్మిగ నూరు ఎమ్మెల్యే "ఎర్రకోట చెన్నకేశవరెడ్డి", ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీమతి" బుట్టా రేణుక పాల్గొన్నారు..

### బద్వేల్ టిడిపి అభ్యర్థులపై సోషల్ మీడియాలో చర్చ

బద్వేల్,బద్వేల్ లో టీడీపీ అభ్యర్దుల అంశం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. రెండు దశాబ్దాలుగా బద్వేల్ టిడిపికి పెద్దదిక్కుగా మాజీ మంత్రి వీరారెడ్డి కుటుంబం వుంది. 2009లో బద్వేల్ నియోజకవర్గం ఎస్సీ రిజర్వుడు అయింది. 2009 నుంచి 2024 వరకు నలుగురు అభ్యర్థులను మార్చినా అందని ద్రాక్ష గానే గెలుపు వుంది. ప్రతి ఎన్నికల్లో ఓ ప్రభుత్వ ఉద్యోగిని రాజీనామా చేయించి బరిలో దించడం వదిలేయడం. తాజాగా ఇరిగేషన్ శాఖలో ఇంజనీర్ గా పనిచేస్తున్న బొజ్జ రోషన్నను బరిలో దించే ప్రయత్నం జరిగింది. అయన ఉద్యోగం వదిలేసి కొంతకాలంగా టిడిపి అభ్యర్థిగా ప్రచారం చేస్తున్నారు. ఇంతలో పొత్తులో భాగంగా సీటు బిజెపికి ఇస్తారంటూ ప్రచారం వెలుగులోకి వచ్చింది.

# "సమ సమాజ నిర్మాణమే లక్ష్యం..

**""అభివృద్ధి చేసేందుకే కర్నూలు నుండి పోటీ..!" అవకాశమిస్తే ప్రజల సమస్యలను పరిష్కరిస్తా: ఏపీ రామయ్య యాదవ్**



కర్నూలు మార్చి20 విభారె న్యూస్..కుల మతాలు లేని సమ సమాజ స్థాపనకే జాతీయ సమసమాజం పార్టీ ఆవిర్భవించిందని ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ఏపీ రామయ్య యాదవ్ స్పష్టం చేశారు.సమాజ హితం కోసం తన పార్టీని గెలిపించి,కుటుంబ పార్టీల పాలనకు చరమగీతం పాడాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం ఆ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఏపీ రామయ్య యాదవ్ కర్నూలు ప్రజల సమస్యలు పరిష్కరించేందుకే తాను కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నానని తెలిపారు. ప్రజలందరూ తనకు అవకాశం ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజల సమస్యల పరిష్కారంతోపాటు ,కర్నూలు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పారు. పరిశ్రమలు కాపాడుకోవడం కోసం రాజకీయాల్లోకి వచ్చిన వ్యక్తులను కాకుండా ప్రజాసేవ కోసం వచ్చిన తనలాంటి వ్యక్తులను ప్రజలు ఎన్నికల్లో ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. వైసిపి,టిడిపి జెండాలు వేరైనా, అజెండాలు మాత్రం ఒకటేనని, ఈ రెండు పార్టీలు స్వార్థ నిర్ణయాలతో 30 ఏళ్లుగా ప్రజలకు తీరని ద్రోహం చేస్తున్నాయని విమర్శించారు. తనను కర్నూలు ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజల తాగు నీటి సమస్య పరిష్కరించేందుకు 2 సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల నిర్మాణంతోపాటు నూతన తాగునీటి కొళాయి పైపులను నగరమంతా ఏర్పాటు చేసి, ప్రజలందరికీ త్రాగునీరు సరఫరా చేస్తానని హామీ ఇచ్చారు. అస్తవ్యస్తమైన డ్రైనేజీ వ్యవస్థను గాడిన పెట్టేందుకు నగరంలో అండర్గ్రౌండ్ డ్రైనేజీని నిర్మిస్తానని తెలిపారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశ కల్పించేందుకు పరిశ్రమలను ఏర్పాటు చేయిస్తానని అన్నారు. పాత బస్తీలో ఇరుకు సందుల్లో శిథిలమవుతున్న విద్యుత్ స్తంభాలను బాగు చేస్తానని చెప్పారు. అర్హులైన పేదలందరికీ పింఛన్లు ఇప్పించేందుకు కృషి చేస్తానని చెప్పారు. కర్నూల్ నగరంలోని దిక్కుమొక్కు లేని వారు ,వృద్ధులు, అనాధల కోసం ప్రభుత్వం లేదా స్వచ్ఛంద సంస్థలతో ఉచితంగా అనాధ శరణాలయాలు, వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. పగలంతా పనిచేసి వచ్చిన కార్మిక వర్గాల కోసం ప్రభుత్వ ఆసుపత్రిలో సాయంత్రం పూట ప్రత్యేక ఓపి ఏర్పాటు చేయించి, ప్రత్యేకంగా వైద్యులు ఉండేలా చర్యలు తీసుకుంటానని వెల్లడించారు. డబ్బున్న వారే రాజకీయాల్లో ఏలాలన్న భావన నుండి ,సామాన్యుడు కూడా ఎన్నికల్లో పోటీ చేసి, రాజకీయాల్లో రాణించవచ్చనే విధంగా ప్రజల్లో మార్పు తీసుకొస్తానని ఏపీ రామయ్య యాదవ్ దీమా వ్యక్తం చేశారు. స్వార్థం కోసం, ఆస్తులు కాపాడుకోవడానికి ,పరిశ్రమలు కాపాడుకోవడం కోసం ఎన్నికల్లో పోటీ చేస్తున్న రాజకీయ నాయకులను ప్రజలు ఈ ఎన్నికల్లో తిరస్కరించాలని ఆయన పిలుపునిచ్చారు. సామాన్యుల ఓట్లు సామాన్యులకే వేసేలా సమసమాజ నిర్మాణాన్ని నిర్మించాలన్నది తన ఆశయమని పేర్కొన్నారు. కర్నూలులో తన ఎన్నిక ద్వారా సరికొత్త రాజకీయాలకు అంకురార్పణ చేస్తానని రామయ్య యాదవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. పేద ప్రజలకు నిరుద్యోగ యువజనులకు ఉపాధి చూపకుండా ఉచిత హామీలతో అధికార ప్రతిపక్ష పార్టీలు బానిసలను చేస్తున్నాయని ఆయన ఘాటుగా విమర్శించారుధన బలంతో ఎన్నికల్లో పోటీ చేసి రాజకీయాలు నడుపుతున్న వారిని బుద్ధి చెప్పేందుకే తాను ఎన్నికల్లో పోటీ చేస్తున్నానన్నారు. కర్నూలు ప్రజలందరూ తనకు ఓటు వేసి గెలిపిస్తే, సమ సమాజాన్ని నిర్మించి అసమానతలు లేని భవిష్యత్తును అందిస్తానని ఏపీ రామయ్య యాదవ్ కర్నూలు నియోజకవర్గ ప్రజలకు భరోసానిచ్చారు.

# బాబు పై నమ్మకం ఉందీ... బీ ఫామ్ నాకే....

**చంద్రబాబు నాయుడు పునర్ పరిశీలన చేసి న్యాయం చేస్తారు...**






ధర్మవరం విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- మార్చి 20 పట్టణంలో ప్యాపిలి మండలం టిడిపి నాయకులతో కలిసి నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో డోన్ నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి మాట్లాడుతూ రెండున్నర సంవత్సరాల కిందట తెలుగుదేశంపార్టీ అధినేత శ్రీ నారా చంద్రబాబు నాయుడు నన్ను ఇంచార్జ్ గా ప్రకటించిన తరువాత జలదుర్గం, ప్యాపిలి లో నన్ను అభ్యర్థిగా ప్రకటించడం జరిగింది. అంతకుముందు డోన్ నియోజకవర్గంలో ఎవరైతే పని చేశారో కె.యి - కోట్ల కుటుంబాలను వారి ఇళ్ళకు వెళ్ళి డోన్ నియోజకవర్గంకు రమ్మని అడగటం జరిగిందని, వాళ్ళ రామని చెప్పిన తరువాతనే కె.యి.ప్రతాప్ అన్న చంద్రబాబు నాయుడు దగ్గరకు తీసుకెళ్ళి మాట్లాడిన తరువాత నన్ను ఇంచార్జ్ గా ప్రకటించడం జరిగింది. నేను రెండున్నర సంవత్సరాలు పని చేసిన తరువాత కెయి - కోట్ల కుటుంబాలు మేమే ఉండాలనే ఉద్దేశ్యంతో ఆరెండు కుటుంబాలు ఏకమై నాకు టికెట్ రాకుండా చేశారని అన్నారు. అయినప్పటికీ ఇప్పటికైనా నారా చంద్రబాబు నాయుడు పైన పూర్తి నమ్మకం ఉందని, మరల డోన్ నియోజకవర్గం పై చంద్రబాబు నాయుడు పునర్ పరిశీలన చేసి డోన్ నియోజకవర్గ బీ ఫామ్ నాకే ఇస్తారని నమ్మకం ఉందని అన్నారు. అదేవిధంగా తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు ఎవరు నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదు, మీ నిర్ణయం మేరకు ముందుకు పోతానని అన్నారు.ఈ సమావేశంలో ప్యాపిలి పట్టణ టిడిపి అధ్యక్షులు భూశెట్టి చిన్న సుంకయ్య, ఎర్రగుంట్లపల్లె వేంకటేశ్వర రెడ్డి, ప్యాపిలి మండలం టిడిపి ప్రధాన కార్యదర్శి మెట్టుపల్లె సుదర్శన్, అంకిరెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ దానం మధుసూదన్ మరియు ప్యాపిలి మండలం నాయకులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు



కర్నూలు, స్పోర్ట్స్ న్యూస్: మహారాష్ట్ర రాష్ట్రం లోని ఔరంగబాద్ లో ఈ నెల 29 నుంచి ఏప్రిల్ 2 వ తేదీ వరకు జరిగే సబ్ జూనియర్ జాతీయ స్థాయి బాల బాలికల సాఫ్ట్ బాల్ ఛాంపియన్షిప్ లో జిల్లా కు చెందిన ఇద్దరు క్రీడాకారులు జగన్ ( మోంటెస్సోరి హై స్కూల్ ), కృతిక (కేశవరెడ్డి హై స్కూల్ వెంకటరమణ కాలనీ ) ఎంపికయ్యారు. అనంతపురం ఆర్. డి. టి. లో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ ఎంపిక పోటీలలో క్రీడా నైపుణ్యాలను కనబరిచిన ఫలితంగా జాతీయ స్థాయి కి ఎంపికైనట్టు జిల్లా సాఫ్ట్ బాల్ సంఘం అధ్యక్షులు ఎన్.జాకీర్ హుస్సేన్, కార్యదర్శి కె. విజయ్ కుమార్ సంయుక్త్యంగా ఒక ప్రకటన లో తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం కర్నూల్ ఔట్ డోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమం లో డి.ఎస్.డి.ఓ. బి. భూపతి గారు ముఖ్య అతిధిగా హాజరై జాతీయ స్థాయి కి ఎంపికైన క్రీడాకారులను అభినందించి పుష్ప గుచ్చలను అందచేసి సత్కరించరు. జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించి జిల్లాకు పెరు ప్రఖ్యాతలు తీసుకొని రావాలని ఆకాంక్షించారు.

# అహోబిలంలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

**ఎగువలో అలరించిన మోహిని అలంకారం**
**స్వర్ణ శేష వాహనంపై కొలువుతీరిన ప్రహ్లాద వరదుడు**
**50 భారీ గేట్లను అందజేసిన రాంకో సిమెంట్ ప్రతినిధులు**
**అహోబిలం బ్రహ్మోత్సవాలకు భారీ బందోబస్తు**



శేష వాహనంపై కొలువైన ప్రహ్లాద వరదుడు




రాంకో సిమెంట్ వారు అందించిన గేట్లు

ఆళ్లగడ్డ ప్రతినిధి మార్చి 20 విభారె న్యూస్ :- ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఎగువ, దిగువ అహోబిలాల్లో కొలువుదీరిన స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు వస్తున్నారు. ఎగువ అహోబిలంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ఉత్సవమూర్తి జ్వాల నరసింహ స్వామిని అర్చకులు మోహిని అలంకారంలో ప్రత్యేకంగా అలంకరించారు. పూజలు నిర్వహించిన అనంతరం స్వామిని అహోబిల మాడ వీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి శరభ వాహనంపై జ్వాల నరసింహ స్వామిని ఆశీనులను చేసి పూజల అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. దిగువఅహోబిలంలో. .....బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం దిగువ అహోబిలంలో ఉత్సవమూర్తులు ప్రహ్లాద వరద స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను శేష వాహనంపై అలంకరించి పూజలు నిర్వహించారు. మాడ వీధుల గుండా ఊరేగింపుగా అహోబిలం చేరుకున్న స్వామి, అమ్మవార్లను 46వ పీఠాధిపతి స్వామి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి చంద్రప్రభ వాహనంపై ప్రహ్లాద వరద స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు అనంతరం అహోబిలం మాడవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. భారీ గేట్ల విరాళం......అహోబిల దేవస్థానానికి రాంకో సిమెంట్ కంపెనీ వారు 50 గేట్లను దేవస్థానానికి అందజేశారు. ఆరు లక్షల రూపాయల విలువ గల 50 భారీ గేట్లను దేవస్థానానీ ఓ ఎస్ డి శివప్రసాద్, కమ్యూనికేషన్ అధికారి సేతురామన్ లకు అందజేశారు. అహోబిలం బ్రహ్మోత్సవాలకు భారీ బందోబస్తు: అహోబిలం లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 150 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు డి.ఎస్.పి షేక్ షర్ఫుద్దీన్ తెలిపారు. బ్రహ్మోత్సవాలలో ముఖ్యమైన స్వామివారి కల్యాణోత్సవం, రథోత్సవం , గరుడోత్సవం రోజున గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులు కూడా సహకరించాలన్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190